క్లుప్తంగా

శ్రీపర్వతవర్ధిని సన్నిధిలో కలెక్టర్ పూజలు



పూజలు చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శ్రీపర్వతవర్ధిని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ముందుగా సహస్రనామార్చన, పారాయణములు, చండీ హవనం జరిపించారు. వేడుకల్లో కలెక్టర్ హనుమంతరావు పాల్గొని పూజలు చేశారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుంది

ఆలేరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆలేరు పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి బలమున్న స్థానాల్లో సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేయడానికి నాయకులు సిద్ధంకావాలన్నారు. మిత్రపక్షమైన కాంగ్రెస్‌తో కలిసి ఈ ఎన్నికల్లో పనిచేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణరెడ్డి, చేడె చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, కళ్లెం కృష్ణ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

2న మాంసం విక్రయ దుకాణాలు బంద్

భూదాన్‌పోచంపల్లి : గాంధీ జయంతి సందర్భంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలో మటన్, చికెన్ దుకాణాలను బంద్ చేయాలని మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాంసం విక్రయాలు చేయవద్దని దుకాణదారులకు నోటీసులు ఇస్తున్నామని తెలిపారు. గాంధీ జయంతి రోజు షాపులు తెరిచి మాంసం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వలిగొండ : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 2 న మటన్, చికెన్ దుకాణాలు తెరవద్దని పంచాయతీ కార్యదర్శి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు దుకాణ యజమానులు సహకరించాలని ఆయన కోరారు. మాంసం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ

గుండాల : గుండాల మండల ఎంపీడీఓగా చందీరాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన పి.దేవేందర్‌రావు బదిలీపై అడ్డగూడూరు మండలానికి వెళ్లారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందుగుల బాలకృష్ణ, ఉప్పల లింగస్వామి, అక్బర్ అలీ, ఉప్పల విజయలక్ష్మి, కొన్‌రెడ్డి నర్సింహ, రాచకొండ రమేష్‌బాబు, ఉప్పల నాగరాజు, కృష్ణ, శంకర్, శ్రీనివాస్, యాదయ్య పాల్గొన్నారు.
30ఏఎల్ఆర్ 902.జెపిజి. నూనెగూడెంలో స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని చేపడుతున్న ఎస్‌బీఐ సిబ్బంది

నూనెగూడెంలో 'స్వచ్ఛతా హి సేవా'

గుండాల : మండలంలోని నూనెగూడెం గ్రామంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లని ఊడ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, బ్యాంకు సిబ్బంది నవీన్, గంగాధర్, రాజమల్లు, గిరిబాబు పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామంలో తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన విషయం మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పారుపల్లి గ్రామానికి చెందిన లగ్గాని చినఅయోధ్య కుమారులు హైదరాబాద్‌లో ఉంటుండటంతో దసరా పండుగకు వారి వద్దకు వెళ్లాడు. దీంతో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చినఅయోధ్య ఇంటి తాళం పగులగొట్టి రూ.45వేల నగదు అపహరించుకుపోయారు. అదే గ్రామానికి చెందిన బద్దిపడిగ నరేందర్‌రెడ్డి ఆరోగ్యం బాగోలేక భార్యతో కలిసి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు నరేందర్‌రెడ్డి ఇంటి తాళం కూడా పగులగొట్టి మూడు తులాల విలువైన మూడు బంగారు గొలుసులు, 20 తులాల వెండి పట్టా గొలుసులు, రూ.49,700 ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతు తెలిపారు.

వంతెన పనులు పూర్తయ్యేదెప్పుడో?

- పిల్లర్ల దశలోనే నిలిచిన పారుపల్లి బ్రిడ్జి పనులు
- వర్షాకాలంలో వాగు దాటేందుకు ఇబ్బందులు



పిల్లర్ల దశలో నిలిచిపోయిన పారుపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు

రాజాపేట : మండలంలోని పారుపల్లి వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పారుపల్లి వాగుపై హైలేవల్ బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ నిధులు రూ. 13.6కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ. 7.5 కోట్లు బ్రిడ్జి నిర్మాణం కోసం వినియోగించి మిగతా నిధులు దారి ఏర్పాటు కోసం ఖర్చు చేయాల్సి ఉంది. అయితే పిల్లర్ల పనులు పూర్తయిన వాటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఇటీవల నిలిపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు సైతం కోతకు గురవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా పైపులు వేసి ఏర్పాటు చేసిన రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

15ఏళ్లుగా ఇబ్బందులు

2010 అక్టోబర్ 31న కుర్రారం చెరువుకు గండిపడడంతో వరద ఉధృతికి పారుపల్లి వాగుపై ఏర్పాటు చేసిన కల్వర్టు కొట్టుకు పోయింది. దీంతో వాగుపై తాత్కాలికంగా పైపులువేసి ప్రయాణికులు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి ఏటా వర్షాకాలంలో పారుతున్న వరద నీటి ప్రవాహానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు దెబ్బతింటోంది. వానాకాలంలో వాగు దాటేందుకు ఇబ్బందులు ఎదరవుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ వాగు ఉధృతంగా ప్రవహిస్తే బొందుగుల, పారుపల్లి, గోధుమకుంట, సోమారం గ్రామాల ప్రజలు, రైతులు కుర్రారం మీదుగా రాజాపేట మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు, రైతులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

పారుపల్లి వాగుపై కల్వర్టు కొట్టుకుపోయి 15ఏళ్లు గడిచిన నేటి వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి ఏటా వర్షాకాలంలో వాగు దాటడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. త్వరగా వంతెన పనులు పూర్తిచేయాలని కోరుతున్నాం.

– బూపతి బాలకిషన్ పారుపల్లి

పనులు పూర్తి చేయాలి

నిత్యం పారుపల్లి వాగు దాటి రాజాపేట వైపు ఉన్న మా వ్యవసాయ బావివద్దకు వెళ్లాల్సి ఉంటుంది. వానాకాలంలో వాగుపై దాటాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయించాలని కోరుతున్నాం.

– గౌర రాములు, రైతు పారుపల్లి

ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు



చొల్లేరులో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండంలోని చొల్లేరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, అవి ఏఏ దశల్లో ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు వెళ్లాలన్నారు. బిల్లులు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట పలువురు అధికారులు ఉన్నారు.

గో సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న చికోటి ప్రవీణ్

రాజాపేట : గో సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర నాయకుడు చికోటి ప్రవీణ్ అన్నారు. మంగళవారం రాజాపేట మండలంలోని బేగంపేట, చల్లూరు గ్రామాల్లో శ్రీ దుర్గా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలన్నారు. ప్రతి గ్రామంలో గో రక్షక్ దళాలు ఏర్పడి గోవును రక్షించుకోవాలన్నారు. యువత ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా నాయకుడు పరమేష్ గౌడ్ ఉన్నారు.

వరికోత యంత్రంలో పడిన 16 అడుగుల కొండచిలువ

ఆత్మకూరు(ఎం): వరికోత యంత్రంలో పడి కొండచిలువ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామ స్టేజీ వద్ద మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంఖాన్‌పేట గ్రామ స్టేజీ వద్ద మండల కేంద్రానికి కమ్మగాని శ్రీను భూమిని సూదగాని భాస్కర్ కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మంగళవారం భాస్కర్ వరికోత యంత్రంతో వరి చేను కోయిస్తుండగా.. కొండచిలువ వరికోత యంత్రంలో పడి మృతిచెందింది. కొండచిలువ సుమారు 16 ఫీట్ల పొడవు ఉంది.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సురేశ్ రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి. సురేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జలాల్‌పురం, గజేంద్రనగర్ కాలనీలో పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో గ్రామంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, శ్రమదానం, ఇంటింటా సామాజిక, ఆర్థిక, విద్యా సర్వే తదితర అంశాల నివేదికను చదివి వినిపించారు. విద్యార్థులు తమ స్వీయ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ క్యాంపుల ద్వారా సేవభావం పెంపొందుతాయన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జ్యోతి, సాయివర్ధన్‌లను గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, గ్రామస్తులు పాలకూర్ల ఆగయ్య, సురేందర్‌రెడ్డి, నక్క శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, మహేశ్, శ్రీరాములు, నవీన్, ఉపేందర్, నరేశ్, సత్యనారాయణ, చింటూ, శాపాక రాజు, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

భువనగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ్మా, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు ఏదునూరి మల్లేశం, నాగమణి, ఎల్లయ్య, మైసయ్య, వెంకటేష్, యాదగిరి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి గంగదేవి సైదులు, నాయకులు చీరిక సంజీవరెడ్డి, తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, అంతటి అశోక్, నందీశ్వర్, మధుకృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

రామన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య అన్నారు. మంగళవారం జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జెల్లెల పెంటయ్య నాయకులు కూరెళ్ల నర్సింహాచారి, వనం ఉపేందర్, బల్గూరి అంజయ్య, బోయిని ఆనంద్, హన్మంత్, గన్నెబోయిన విజయభాస్కర్, పల్లి బాలరాజు, మీర్ ఖాజాఅలీ, నాగటి ఉపేందర్, ఎండీ రషీద్, శ్రీనివాస్, వేముల సైదులు, నాగేష్, గణేష్ గంటిపాక శివ, పుట్టల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న యువకులు

భూదాన్‌పోచంపల్లి : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇంద్రియాల గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి బానిస కావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, ఏఎస్ఐ శంకర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, నాయకులు చింతల రామకృష్ణ, దిరావత్ వెంకటేశ్‌నాయక్, పెద్దిరెడ్డి యాదగిరి, శెట్టి మల్లేశ్, కృష్ణ, అశోక్, రమేశ్, పోలీస్‌సిబ్బంది శ్రీనివాస్, వినోద్ క్రాంతియూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న వీరారెడ్డి

సంస్థాన్ నారాయణపురం: స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి అన్నారు. మంగవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్, బచ్చనగోని దేవందర్, జక్కలి రాజుయాదవ్, భాస్కర్ నర్సింహ్మా, రఘు కిరణ్, జగత్‌కుమార్, యాదగిరి, మహేందర్‌రెడ్డి, రాములు, బూస శ్రీనివాస్‌గుప్త తదితరలున్నారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనం



అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

మోత్కూరు : మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరు కాగా 2024 నవంబర్‌లో పంచాయతీ భవన నిర్మాణం పనులకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భవన నిర్మాణం పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో స్లాబ్ దశలో పనులు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి త్వరితగతిన గ్రామ పంచాయతీ భవనం పనులు పూర్తయ్యే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిల్లులు రాలేదు

స్లాబ్ లెవల్ వరకు గ్రామ పంచాయతీ భవనం పనులు పూర్తయ్యాయి. బిల్లులు చేసి ఉన్నతాధికారులకు పంపాం. ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించిన బిల్లు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు.

– మంగులాల్, పీఆర్ డిప్యూటీ ఈఈ

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



భువనగిరి : ఇందిరానగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు,యవతులు



చౌటుప్పల్ : బతుకమ్మలను తీసుకుని వస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, సిబ్బంది, మహిళలు

భువనగిరి : భువనగిరి పట్టణంలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తిరుక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం భువనగిరి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, భువనగిరి పెద్ద చెరువు వద్ద యువతులు, మహిళలు బతుకమ్మ ఆట ఆడుతూ పాటలు పాడారు. అనంతరం పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

చౌటుప్పల్ : మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేసి వేడుకను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు సంధ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వలిగొండ : మండలకేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన బతుకమ్మ వేడుకలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కూతురు కీర్తి రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం గౌరమ్మకు పూజలు నిర్వహించి ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



భువనగిరి : బతుకమ్మ ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి సతీమణి వనిత

మోత్కూరు : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుర్రం కవిత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ పోటీలలో గెలుపొందిన వారికి మంగళవారం బహుమతులను పంపిణీ చేశారు. జినుకల మంగమ్మ రూ.5000 (ప్రథమ), మన్నె సౌభాగ్య రూ.3000 (ద్వితీయ), దబ్బెటి నిర్మల రూ.2000 (తృతీయ) బహుమతులను, 32 మంది మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రజా భారతి అధ్యక్షులు బోళ్ల హన్మంతు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బయ్యని వెంకటేశ్వర్లు, బహుమతుల దాత పల్లెర్ల వెంకన్న, సంస్థ ప్రతినిధులు అరవిందరాయుడు, జయశ్రీ, రామ్‌ప్రసాద్, వారాల యాదగిరి, మనోహర్, యాకస్వామి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దుర్గా దేవిగా అమ్మవారు



ఆత్మకూరు(ఎం) : రహీంఖాన్‌పేటలో పూజలు నిర్వహిస్తున్న భవానీ మాలధారులు



రాజాపేట : రేణికుంటలో దుర్గామాత వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు



యాదగిరిగుట్ట రూరల్: మల్లాపురం లో పూజలు చేస్తున్న భక్తులు



అడ్డగూడూరు : చౌల్లరామారంలో పూజలు నిర్వహిస్తున్న భవానీ మాలధారులు



మోటకొండూర్ : దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



రామన్నపేట : కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు



రామన్నపేట : నగర సంకీర్తన నిర్వహిస్తున్న భవానీ మాలధారులు

ముమ్మరంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు



కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు

రామన్నపేట : మండల కేంద్రంలోని కొమ్మాయిగూడెం రోడ్డు వెంట చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు పట్టణంలోని సినిమా టాకీసు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు గల ఆర్ అండ్ బీ రోడ్డు వెంట డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై పారేది. డిస్ట్రిక్ట్ మినరల్ గ్రాంట్ నుంచి మంజూరైనా రూ. 10 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులు పూర్తి కావస్తుడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్

ఆలేరు: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు పేర్కొన్నారు. మంగళవాం ఆలేరు పట్టణం ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూమ్‌ను అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. స్ట్రాంగ్‌లోని బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించారు. వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ఆయన వెంట డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీఓ అనురాధ ఉన్నారు.

వీల్ చైర్లు అందజేత

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ పరిధిలోని జామచెట్లబావి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మర్రి శరణమ్మ, పాటిమట్ల గ్రామానికి చెందిన దివ్యాంగులు నర్సింహలకు మంగళవారం రాజమాత ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీల్ చైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు ఉదయ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మనోజ్‌రెడ్డి, సభ్యులు మంగమ్మ, టీమ్ వాలంటీర్ చందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చౌటుప్పల్ రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన శేరి శ్రీనివాస్‌రెడ్డి(63) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తూప్రాన్‌పేట గ్రామంలో ఎలక్ట్రికల్ పనిచేసి సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తూ.. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా.. విజయవాడ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.